క్లుప్తంగా

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం


గౌరీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: స్థానికంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వడ్డాది–నర్సీపట్నం రోడ్డులో హనుమాన్ ఆలయం నుంచి వినాయకుని ఆలయం వరకు, వీధుల్లోనూ విద్యుదీపాలంకరణ ఆకట్టుకుంది. వెదురుతో 50 అడుగుల నిడివితో తయారైన బండి ప్రభను ప్రతిష్ఠించారు. పల్లకిపై ఉత్సవమూర్తులను ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శనివారం స్థానిక కోనేరులో నిమజ్జనం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి గౌరీపరమేశ్వర ఉత్సవాలు

గొలుగొండ: మండలంలో జోగుంపేట, అమ్మపేట గ్రామాల్లో శనివారం నుంచి గౌరీపరమేశ్వర ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం కోసం కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. శని, ఆదివారాల్లో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు.

కె.సంతపాలెంలో 139 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలను చేస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: ప్రజల చెంతకే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేరిట వైద్య సేవలు అందిస్తున్నట్లు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. శుక్రవారం కె.సంతపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలందించారు. 139 మందికి ఓపీ ద్వారా వైద్య సేవలతోపాటు ఉచితంగా మందులను అందించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ చిన్నారులకు ఆరోగ్య పరీక్షలతోపాటు అచేతన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి 12 మందికి వైద్యం అందించారు. ఎంపీహెచ్‌ఈవో రాజశేఖర్, వైద్య సిబ్బంది రమణ పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు డీటీగా పదోన్నతి

మాడుగుల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మూడేళ్లుగా సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొర్రా అప్పారావుకు డిప్యూటీ తహసీల్దార్‌గా (రీసర్వే)కు పదోన్నతి కల్పిస్తూ జేసీ కల్పనా కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన అప్పారావును తహసీల్దార్ పీవీరత్నం, డిప్యూటీ తహసీల్దార్ పి. సత్యనారాయణ, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం అభినందించారు.

కె.జె.పురంలో పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న ఉప సర్పంచ్ గుమస్తా

మాడుగుల రూరల్: కె.జె.పురంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి పెంకి శివ పర్యవేక్షణలో సర్పంచ్ జామి రమణబాబు, ఉప సర్పంచ్ కాళ్ల జగన్, పంచాయతీ గుమస్తా పీలా ఆనందరావుల సారథ్యంలో శుక్రవారం ప్రధాన మురుగు కాలువల్లో పూడిక తీయించారు. చెరకు కాటా నుంచి కాలువల్లో పేరుకుపోయిన మురుగును తీయించారు. ప్రధాన రహదారిలో చెత్త కుప్పలు, ప్లాస్టిక్ గ్లాసులు, సంచులను కాలువల్లో వేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

మునగపాక : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత నాయకులు లంబా శ్రీనివాసరావు, పోతురాజు శుక్రవారం మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలందించిన అంబేడ్కర్‌పై తప్పుడు ప్రేలాపనలు చేయడం తగదన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో దళిత నాయకులు లంబా అర్జునరావు, బీలా లక్ష్మణరావు ఉన్నారు.

సీఎం ఆశయానికి మీరే రథసారథులు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


కార్యక్రమంలోమాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ


కార్యక్రమానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

రావికమతం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా గృహసారథులు రథసారథులుగా పనిచేయాలని, మరింతగా కష్టపడితే మళ్లీ గెలుపు తథ్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. రావికమతం, రోలుగుంట మండలాల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం కొత్తకోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని ఆదేశించారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు కచ్చితంగా అందాలన్నారు. సీఎం గొప్ప ఆశయంతో ప్రజలకు ఎన్నెన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని వివరించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలిస్తే రాష్ట్రాభివృద్ధితోపాటు పార్టీ శ్రేణులకు సముచిత గౌరవం దక్కుతుందన్నారు. ఎంపీపీ పైల రాజు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకట రమణ, భవానీ ప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, జెడ్పీటీసీ భర్త తలారి ఆదిమూర్తి, కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, పార్టీ మండల కార్యదర్శి శీలం శంకర్రావు, కొత్తకోట ఎంపీటీసీలు కుంచా లక్ష్మి, పూడి దేవా, పైల చినమ్మలు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల మేలుకు సంక్షేమ కార్యక్రమాలు

- ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్


సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: పాదయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా చూసి అన్ని వర్గాలకు మేలు చేసేలా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కోరారు. శుక్రవారం గన్నవరం మెట్ట, వై.బి.అగ్రహారం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి నవరత్నాలపై వివరించారు. నాడు – నేడులో రూ.18.25 లక్షలతో నిర్మించిన అదనపు భవనాలను ప్రారంభించారు. గన్నవరం మెట్ట వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల తనకు రూ.3 లక్షలుపైగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందిందని టీడీపీ కార్యకర్త ఎస్. లక్ష్మి ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేసింది. టీడీపీ హయాంలో పార్టీ క్రియాశీలక కార్యకర్తగా వ్యవహరించానని, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివక్ష చూపకుండా పథకాలు మంజూరు చేసిందని ఆమె చెప్పడంతో అక్కడున్న వారంతా నివ్వెరపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇస్తుందన్నారు. జగన్ పాదయాత్ర గన్నవరం మెట్ట వద్దే నుంచి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రారంభమైందన్నారు. ఇక్కడ బ్రిటిష్ హయాం నుంచి వెదుళ్లగెడ్డపై వంతెన సమస్య వెంటాడుతుందన్నారు. రూ. 14 కోట్లతో దీని నిర్మాణంతోపాటు జిల్లా సరిహద్దు నుంచి శృంగవరం వరకు అర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించామన్నారు. వై.బి.అగ్రహారం పంచాయతీని సర్పంచ్ కోసూరి విజయ అభీష్టం మేరకు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ శెట్టి నూకరాజు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, గన్నవరం, పి.కె.గూడెం పర్సన్ ఇన్‌చార్జులు గొర్లె వరహాలబాబు, అచ్చెర్ల వరహాలబాబు, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, హౌసింగ్ జేఈ జోగారావు, సర్పంచులు కోసూరి విజయ, మలపురెడ్డి బాబ్జి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఉలబాల శ్రీను, ముత్తా శివాజీ, రెడ్డి సత్యనారాయణ, కరక అప్పలరాజు, గుడపర్తి అచ్చియ్యనాయుడు, శివాలయ కమిటీ చైర్మన్ ముత్తా సత్తిబాబు, ఎంఈవో తాడి అమృత్‌కుమార్, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

నేడు మన్యపురట్లలో గడప గడపకు

మన్యపురట్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు అన్నారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ హాజరయ్యే కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా అడవి రాజులబాబు పండగ


మర్రిపాలెంలో రాజులబాబులను దర్శించుకుంటున్న భక్తులు


పండగలో భక్తులు కోలాహలం

నాతవరం: మండలంలో అడవి రాజులబాబు పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మర్రిపాలెం, వెన్నలపాలెం, శృంగవరం, ఎం.బి.పట్నం, వల్సంపేట, నాతవరం గ్రామాల్లో ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయాలన్నీ కిక్కిరిసిపోయాయి. వీరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. పండగ సందర్భంగా ఆయా గ్రామాల్లో శక్తి వేషాలు మహిళల కోలాహటం, భజనలు ఆకట్టుకున్నాయి, కొన్ని గ్రామాల్లో రాజులబాబు ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మాకవరపాలెం: మండలంలోని నాలుగు గ్రామాల్లో అడవి రాజులబాబు పండగను ఘనంగా నిర్వహించారు. జి.కోడూరు, నగరం, కొండలఅగ్రహారం, రాచపల్లి గ్రామాల్లో శుక్రవారం అడవి రాజులబాబు పండగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులంతా ఆయా గ్రామాల్లో ఆలయాలకు ఒకేసారి చేరుకుని పూజలు చేయడంతోపాటు మొక్కులు చెల్లించుకున్నారు.

350 జీవాలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు


ముకుందపురంలో వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ చిట్టినాయుడు

మాడుగుల రూరల్: మండలంలోని ముకుందపురం, జి. అగ్రహారం, తాటిపర్తి గ్రామాల్లో శుక్రవారం 350 గొర్రెలకు, మేకలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ముకుందపురంలో టీకాల కార్యక్రమాన్ని మాడుగుల ఏరియా పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందన్నారు. ఇంత వరకు 2,955 జీవాలకు టీకాలు వేశామన్నారు.

రుణాలు, జమ ఆధారంగానే పురోగతి


మాట్లాడుతున్న డీజీఎం కనకదుర్గ

రోలుగుంట: డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాల మంజూరు, జమలులో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, వీవోఏలు (గ్రామ స్థాయి యాక్టివిటీస్) బాధ్యత వహించాలని వెలుగు ఏపీఎం సాధన, ఆ శాఖ నర్సీపట్నం డివిజన్ జనరల్ మేనేజర్ కనకదుర్గ తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో శుక్రవారం వీవోఏలతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం,డీజీఎం మాట్లాడుతూ మండలంలో 1,273 స్వయం సహాయక గ్రూపులకు స్త్రీనిధి నుంచి రూ. 4.56 కోట్లు, ఉన్నతి పథకం ద్వారా రూ. 25 లక్షలు, మైక్రో ఫైనాన్స్ నుంచి రూ. 86 లక్షల రుణాలు మంజూరు, జమలు గురించి వివరించారు. రుణాల మంజూరు కోసం ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో, జమ చేయడంలో అంతే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు.

సిమెంటు బెంచీల ఏర్పాటుకు రూ.6 వేల విరాళం


ప్రధాన అర్చకుడికి నగదు అందజేస్తున్న నాగమణి

మాడుగుల రూరల్: స్థానిక మోదకొండమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం సిమెంటు బెంచీల ఏర్పాటుకు విశాఖపట్నానికి చెందిన భక్తురాలు కల్లెంపూడి నాగమణి రూ. 6 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడికి అందజేశారు. ఎం. కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, ఉప సర్పంచ్ గెంజి రాజేశ్, నాయకులు గంగిరెడ్ల లింగన్న, కలిమి గోసన్న పాల్గొన్నారు.

సముద్రంలో వేటకెళ్లే మత్స్యకారులకు కోస్ట్‌గార్డ్ సూచనలు

ఎస్.రాయవరం : మత్స్యకారులు సముద్రంలోనికి చేపల వేటకు వెళ్లేటప్పుడు విధిగా జాగ్రత్తలు పాటించాలని నేవీ కోస్ట్‌గార్డు సిబ్బంది కిషోర్‌కుమార్, అమన్ ద్వివాది అన్నారు. బంగారమ్మపాలెం, రేవుపోలవరం గ్రామాల్లో శుక్రవారం పలువురు మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సముద్రంలోకి వెళ్లిన వారు తీసుకోవాల్సి జాగ్రత్తలు, సముద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పాటించాల్సిన నియమాలతో కూడిన కరపత్రాలను పంచారు. చేపల వేటకు వెళ్లేవారు ఒంటరిగా కాకుండా అందరితో కలిసి వెళ్లాలని, దేశ జెండా పడవపై ముందు, వెనుక భాగాల్లో కనిపించే విధంగా అమర్చుకోవాలని అన్నారు. పడవ ప్రయాణంలో లైఫ్ జాకెట్ విధిగా తీసుకు వెళ్లాలన్నారు. పడవ రంగు ప్రభుత్వ అధికారులు చెప్పినట్టు ఉండాలన్నారు. పడవలో ఎరుపు రంగు వస్త్రం ఉంచుకోవాలన్నారు. పడవలో వాతావరణం సమాచారం తెలుసుకునేందుకు రేడియో వంటి వస్తువు ఉంచుకోవాలన్నారు. దేశ సముద్ర సరిహద్దు దాటకుండా జాగ్రత పడాలన్నారు. ఇలా గ్రామంలో పలు వీధుల్లో ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో వాకపాడు ఎంపీటీసీ మాధవ కూడా పాల్గొన్నారు.

నేడు గౌరీపరమేశ్వరుల ఉత్సవం


కశింకోట ప్రధాన రహదారిలో విద్యుద్దీపాలంకరణ

కశింకోట: కశింకోటలో ప్రసిద్ధి చెందిన డీపీఎన్ జెడ్పీ హైస్కూలు వద్ద వెలసి ఉన్న గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) ఉత్సవం శనివారం జరగనుంది. ఇందుకు భారీ సన్నాహాలు చేసినట్లు ఉత్సవ కమిటీ పేర్కొంది. మండలంలో నిర్వహించే ఉత్సవాల్లో అతి పెద్దదైన పడమటమ్మ ఉత్సవం తర్వాత అంతటి భారీగా గౌరమ్మ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఏటా ఫిబ్రవరి నెలలో గౌరమ్మ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవం సందర్భంగా గ్రామంలో ఆర్కెస్ట్రా, నేల వేషాలతో గౌరమ్మను రథంపై ఊరేగిస్తామని కమిటీ తెలిపింది. ఉత్సవం పురస్కరించుకొని భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. డాన్స్ బేబీ డాన్స్, బుర్ర కథలు, పందెం కోళ్లు, పూనకాల లోడింగ్, రారండోయ్ పండగ చూద్దాం, కరీంనగర్ వారి నెమలి నృత్యాలు, పలు నేల వేషాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఆకర్షణీయంగా విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటుతోపాటు బాణసంచా పెద్ద ఎత్తున కాల్చనున్నట్టు కమిటీ తెలిపింది.

ఎనీమియా వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం


మాట్లాడుతున్న వైద్యాధికారి శైలజ


గర్భిణులతో మాట్లాడుతున్న వైద్యాధికార్లు లలిత, పూజ్య మేఘన

కె.కోటపాడు: గ్రామాల్లో ఎనీమియాతో ఇబ్బందులు పడుతున్న 15 నుంచి 45 ఏళ్ల వయసు మహిళలను ప్రాథమిక దశలోనే గుర్తించాలని వైద్యాధికారి శైలజ తెలిపారు. లంకవానిపాలెం పీహెచ్‌సీలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ రక్తశాతం కంటే తక్కువగా ఉన్న మహిళలను గుర్తించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ, ఏఎన్‌ఎంలు తీసుకోవాలన్నారు. వీరికి వైద్యాధికారులతో మెరుగైన వైద్యం అందించి సాధారణ స్థితికి రక్తశాతం పెరిగే వరకూ పర్యవేక్షించాలని సూచించారు. రక్తహీనత సమస్య లేకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీవో మంగతాయారు తెలిపారు. అప్పుడే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వగలరన్నారు. వైద్యాధికారి జాహ్నవి, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

దేవరాపల్లి: గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో బిడ్డకు జన్మిస్తారని వైద్యాధికార్లు ఎస్.లలిత, ఇ. పూజ్య మేఘన తెలిపారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ యోజనలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన 30 మంది గర్భిణులను పరీక్షించారు. ఐదుగురిని హైరిస్క్ కేసులుగా గుర్తించి మెరుగైన వైద్య సేవల కోసం కె.కోటపాడు కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. హెల్త్ సూపర్ వైజర్లు వెంకటలక్ష్మి, పుష్పరాజ్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవనానికి నిధుల మంజూరుపై హర్షం


నిధుల మంజూరు ధ్రువపత్రాన్ని చూపిస్తున్న ఎంపీపీ రాజేశ్వరి, సర్పంచ్ పెంటమ్మ

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో స్థానిక పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి నాడు–నేడు కింద రూ. 1.70 కోట్లు మంజూరు కావడంపై ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, మాజీ ఎంపీపీ భాస్కరరావు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రస్తుతం పాత పీహెచ్‌సీ భవనానికి రూ.26 లక్షలతో ఆధునికీకరణ పనులు చేస్తుండగా, తాజాగా నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే ధ్యేయంగా పని చేస్తున్నారని కితాబిచ్చారు. సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల మండల ఇన్‌చార్జి కె.వి.రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు వరదపురెడ్డి లలితానాయుడు, వేచలపు అప్పలనాయుడు, దీవి శంకర్, బంధం అప్పలరాజు, కొల్లి ఈశ్వరరావు, సోమిరెడ్డి పేరునాయుడు, సబ్బవరపు మాలిబాబు, కొరుప్రోలు శ్రీను పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదాం


పోస్టర్ విడుదల చేస్తున్న ఉపన్యాసక బృందం

చోడవరం రూరల్: రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల విద్యార్థులకు డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. యువతా మేలుకో, మత్తు పదార్థాలను వదులుకో, బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకో అంటూ పిలుపు నిచ్చారు. అకడమిక్ కోఆర్డినేటర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాల బారిన పడిన యువత జీవితాలు దుర్భరంగా మారుతాయని హెచ్చరించారు. ఇలాంటి పెడదారి పట్టిన యువత కారణంగా సమాజం విపరీత పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటి బారిన పడి సహచరులను ఆ మార్గం నుంచి తప్పించాలని సూచించారు. సీనియర్ ఉపన్యాసకులు రఫీయుద్దీన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ల కో ఆర్డినేటర్లు పి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి, బి.లక్ష్మి, ఉపన్యాసకులు లక్ష్మీమంగమ్మ, ఏ.కృష్ణారావు, టి.భూషణరావు, వి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

బాలకార్మికుల నిర్మూలనకు సమన్వయంతో పని చేద్దాం


అధికారులతో సమావేశమైన ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: బాలకార్మికుల నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో తన కార్యాలయంలో ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ, ఐసీడీఎస్, పోలీసు, సోషల్ వెల్ఫేర్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి బాలల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. మన వంతుగా బాల కార్మికులు ఉండే ప్రదేశాలను గుర్తించి వారికి పని నుంచి విముక్తి కల్పించాలన్నారు. బాలల రక్షణ చట్టాలను విధిగా అమలు చేయాలన్నారు. బాల కార్మికులతో వెట్టిచాకిరీ చేయించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మికులుగా మగ్గిపోతున్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఈ నెల 15వ తేదీ వరకు ఆపరేషన్ రెస్క్యూలో బాలకార్మికులను గుర్తించాలన్నారు. సీఐ ఎస్.గణేష్, సీడీపీవో మేరీ సువార్త, లేబర్ ఆఫీసర్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీ ఇళ్ల పరిశీలన


ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఈ సత్యనారాయణమూర్తి

మాకవరపాలెం: జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను గృహ నిర్మాణశాఖ విజిలెన్స్ విభాగం డీఈ సత్యనారాయణమూర్తి పరిశీలించారు. మండలంలోని తామరం జగనన్న కాలనీని ఆయన శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా నిబంధనల మేరకు ఇళ్లు నిర్మిస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. ఈ కాలనీలో నిర్మాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలల వ్యవధిలో గృహాలు మొత్తం పూర్తి చేస్తే స్థానిక ఎమ్మెల్యేతోపాటు జిల్లా మంత్రులతో ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఆయన వెంట నర్సీపట్నం డీఈ శ్రీఫణి, స్థానిక జేఈ రామలింగస్వామి, వైఎస్సార్ సీపీ నేత గొంతిన హరిబాబు ఉన్నారు.

పి.ఆనందపురంలో అధికారుల విచారణ


విచారణ జరుపుతున్న డీపీవో శిరీషారాణి, జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామమూర్తి

మునగపాక: పల్లపు ఆనందపురంలో శుక్రవారం డీపీవో శిరీషారాణి, జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామమూర్తి విచారణ చేపట్టారు. పల్లపు ఆనందపురం ఎంపీటీసీ కర్రి సంజీవిని, పంచాయతీ కార్యదర్శి షహీమా మధ్య తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి ఇద్దరు అధికారులతో విచారణ కమిటీని నియమించారు. ఈ మేరకు అధికారులు సచివాలయంలో విచారణ చేపట్టారు. వివాదానికి దారి తీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని శిరిషా రాణి,శ్రీరామమూర్తి తెలిపారు. ఎంపీడీవో రవికుమార్,ఈవోఆర్డీ ఈశ్వరరావు ఉన్నారు.

ఆలయాల్లో డిప్యూటీ సీఎం పూజలు


బూడికి శ్రీకృష్ణుని విగ్రహం బహూకరిస్తున్న గ్రామస్తులు

చీడికాడ: చుక్కపల్లిలో శుక్రవారం ఉదయం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అక్కడ వినాయకుడు, శ్రీకృష్ణుడు, అభయాంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించారు. ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ, ఎంపీటీసీ సుంకర వెంకటలక్ష్మి, నాయకులు బాయిశెట్టి వెంకటరమణ, మజ్జి దేవానంద్, సకలా రమణ, పి.ఈశ్వరరావు, నంబారు అప్పారావు పాల్గొన్నారు.